# భార్యా విధేయులు

పోపువాసన ఘాటుగా తగిలేసరికి కమలకి తెలివి వచ్చింది. బద్ధకంగా ఒళ్ళు విరుచుకుని లేచి మంగళ సూత్రాలని కళ్ళకద్దుకొని పది లంగా పైటలో పెట్టుకుంది.

జన్మ జన్మాలకీ యిలాటి మొగుడే కావాలని కోరుకుంది కామోసు!

ఎలాటి మొగుడు ?

కమల లోపలకు వెళ్లేసరికి...

"లేచారా దేవిగారు ! టిఫిన్ రెడీ-!" అని పలకరించాడు-పొయ్యి మీంచి గిన్నె దింపుతూ...ఆమె భర్త కామేశ్వరరావు.

ఆమె నవ్వుతూ...వెళ్ళి ద్వారానికి ఆనుకొని నిలబడి...'ఇంక స్పెషల్ ఏమిటి?' అని అడిగింది.

"'ఇదిగో!! అని చూపెట్టేడు.

"ఉప్మానా!" అని పెదిమ విరుస్తూ అంది.

"ఏం?" అని ఫైర్ అయిన వాడిలా మొహంపెట్టి చూశాడు.

"ఏ ఇడ్లీనో, గారెలో చేస్తే తెలిసి వచ్చును." అంది పకాలున నవ్వి. దాని కతడేం జవాబు చెప్పలేక పోయేసరికి.

"సరేలెండి గాని ఇంక అక్కడికి చాలించి, మీ పని చూసుకోండి. మొహం కడుక్కుని వచ్చి కాఫీ కలుపుతాను మీ కెందుకీ అవస్థ. నేను న్నానుగా ఇలాంటివి చెయ్యడానికి. హాయిగా చేయించుకు తినక !" అని అన్నది.

"అదే పడుకున్నావు లేపడం ఎందుకని చేశాను అంతే!" అని అన్నాడు.

"వద్దని మీకు చెప్పలేదా? నేను చూసుగుంటాగా—ఇక పదండి" అని అతనిని చెయ్యిపట్టుకుని అవతల గదిలోకి పంపివేసింది.

కాని ఇట్లా తరచూ జరిగేది. ఆమె వద్దంటూండడం, అతను ఆమె కన్నా ముందుగా లేచి టిఫిన్ కాఫీ చేసి పెడుతూండటం! అలవాటే, అందుకే బహుశా అలాటి మొగుడే కావాలని భగవంతుణ్ని ప్రార్థిస్తూ వుంటుంది ఉదయాన్నే... మరి అటువంటి భర్త అంటే ప్రియం కాని భార్య వుంటుందా?

కొంతమంది భర్తలు ఆఫీసునుండి ఇంటికి రాగానే భార్యా వండుతూవుంటే ఆ ప్రక్కనే కూర్చుని కూరలు తరగడం బియ్యంతో రాళ్ళేరడం ఉప్పూ మిరపకాయలూ, అందిస్తూండడం చేస్తుంటారు... ఆమె కబుర్లాడుతూ చిత్రంగా సరసంగా మాట్లాడుతూ మధ్య మధ్య వద్దండీ, వద్దండి అని బెట్టు చేస్తూనే పని చేయించుకుంటూ వుంటుంది.

ఆ కిటుకు కనిపెట్టి చాలామంది భార్యా విధేయులయిపోతూ వుంటారు.

* * * *

కుటుంబరావు ఆఫీసునుండి వచ్చాడో లేదో ఇల్లు గొల్లుమనే పోతూంది. పెంకులెగిరి పోతున్నాయి. పిల్లల అల్లరితో పెళ్ళాంగారి కేకలు జోరుగా వినబడుతున్నాయి.

కుటుంబరావు ఇంట్లో అడుగు పెట్టగానే అంత అల్లరి చేస్తున్న పిల్లలూ టక్కున ఊరుకున్నారు. కాని ఆవిడమాత్రం వూరుకోలేదు.

అబ్బబ్బబ్బబ్బ... ఈ పిల్లలకో దండం—నేను చెయ్యలేను బాబూ! ఒకళ్ళూ మాట వినరుకదా! ఇంట్లో పనులెలా అవుతాయి. వాళ్ళని కాస్త చూద్దురూ?" అని అప్పజెప్పేసింది కామాక్షి.

పాపం ఆ మానవుడు ఇంకా బట్టలేనా విప్పలేదు. మొఖమయినా

కడుక్కోలేదు. వచ్చిన వెంటనే కాఫీ అయినా ఇవ్వడం మాని ఇలాగనే సరికి ఆవిడ చిటపటలు చూసి మాట్లాడకుండా...

"ఇలారండి—ఇలారండి" అని పిల్లలందరిని పిలుచుకుని వీధి గుమ్మంలోకి వెళ్ళిపోయాడు. అప్పటికి ఆ ఇల్లాలికి కాస్త తెరిపి అయింది కాబోలు. వెళ్ళి కాఫీ తెచ్చి ఇచ్చింది, ఇస్తూ...

"మీరు వచ్చారంటే సుఖపడతాను బాబూ!...ఇంతవరకూ తోచ నిచ్చారా వెధవలూ" అని నవ్వుతూ అంది.

ఆ పొగడ్తకి ఉబ్బి తబ్బిబ్బైపోయాడు ఆయన.

"ప్లాన్లేస్తూ...పిల్లలు...చంటిది...పడుక్కుందేమిట?" అని అడి గాడు లోపలికి వస్తూ.

"ఇంతసేపూ ఏడిచి, ఏడిచి ఇప్పుడే పడుకుంది."

ఇంతలో గదిలోంచి చంటిపాప ఏడుపు వినిపించింది.

"అదిగో పిలుస్తూంది మిమ్మల్నే..." అని ఓరగా చూస్తూ పెద్ద నవ్వు నవ్వింది.

"అరె! మళ్ళీ ఏడుస్తూందే!" అని గబగబా వెళ్ళి ఉయ్యాలలోంచి తీసి ఎత్తుకుని ముద్దులు కురిపించాడు.

ఇహ అదిమొదలుఅదే లోకం అతనికి.ఆ పిల్లలతోనే వుండిపోతాడు. వాళ్ళకు మొహాలు కడిగాడు, బట్టలు తొడిగాడు, అట్లా షికారు కూడా తిప్పి తీసుకువచ్చాడు.

భోజనాల దగ్గర అందర్నీ తనే సర్ది కూచోబెట్టి—అల్లరి చేయ కుండా చూస్తాడు. భోజనాలయేక ఒక్కొక్కడిని తీసుకువెళ్ళి కడిగి, తుడిచి బట్టలువేసి, అందరికీ పక్కలు వేసి పడుకోబెడతాడు! చదువు కొనే వాళ్ళకు చదువు చెప్పడం పడుకోకుండా మారాం చేసేవాళ్ళను లాలించి కథలు చెప్పి నిద్రపుచ్చడం—ఇదంతా అతని డ్యూటీ!

ఇందులో ఏ ఒక్కటి పొరపాటున మరచిపోయినా "ఆ మాత్రం చేస్తేనేం? నేనొక్కర్తినే అన్నిటికీ చావాలా?" అని కామాక్షమ్మ అంటుంది.

అక్కడితో అయిపోయిందా?...ఆ రాత్రిపూట పిల్లలు ఏడ్చినా, ఊరుకోబెట్టడం, దాహం అంటే నీళ్ళివ్వటం, కడుపు నొస్తోంది నాన్నా! అని ఏ వెధవయినా లేస్తే...దేముడా అని లేచి లాంతరు పట్టుకొని వాళ్ళను తీసుకు వెళ్ళడం–ఆఖరికి చంటిది ఏడ్చినా, భార్యకు నిద్రా భంగం కాకుండా (డబ్బా) పాలు పట్టటం" పడుకోబెట్టడం, ఉయ్యాలలో గుడ్డలు మార్చడం, ఇవన్నీ అతని బాధ్యతలే.

ఇవికాక తెల్లారేక పిల్లల్ని లేపి, పక్కలు తీసి, గొంగలూ దుప్పట్లూ ఎండలో ఆరవేసి, పిల్లల్ని స్కూళ్ళకు పంపడంకూడా అతని పనే.

ఒక్క వంట పని తప్ప మిగతా "ఇంటి పనులు" అంతా చూసుకుంటూంటారు కొందరు భర్తలు, అందుకే ఇలాంటి భర్తలు భార్యలకి ఎల్లప్పుడూ, ప్రియులే మరి.

* * * *

వాలు కుర్చీలో కూచుని పేపరు చదువుకుంటున్న జోగారావు–

"ఏమండీ రేపు ఆదివారం మీకు సెలవే గదుటండీ!" అన్న శ్రీమతి జానకి పిలుపుకి ఇటు తిరిగి—

"ఆఁ...అయితేనేం"—అని ఏమరుపాటున అనేసి–మళ్ళీ కార్యక్రమం జ్ఞాపకం తెచ్చుగొని—నాలిక్కర్చుకున్నాడు.

"ఓ! అవునవును, ఇవాళ ఆదివారంకదూ! మర్చేపోయాను. అలాగే...చేద్దాం—" అని అన్నాడు.

"మరేం—! మళ్ళీ వారం వరకూ తీరికా వుండదు– నాకు తొంగనూ తొంగరు" అని ఆవిడ ఆప్యాయంగా అంది

ఇంతకీ ఆవేళ విశేషం ఏమిటంటే జోగారావుగారికి పాపం అందరూ ఆడపిల్లలే. చిన్నా పెద్దా కలిసి ఎనమండుగురుంటారు—ఒక్కొక్కళ్ళకి ఏ మదృష్టమోగాని బారెడేసి జుత్తు—చిక్కగా, నల్లగా, దళంగా పెద్ద పెద్ద—జుత్తు అందరిదీను. అంచేత ప్రతి ఆదివారం

నాడూ అంటే భర్తగారికి సెలవరోజనన్నమాట. అందరికీ వరసగా తలలంటి పోయడం ఒక కార్యక్రమం. ఆ భార్యాభర్తలిద్దరికి అది తప్పని సరి పని? ఆయనగారు పుల్లపోస్తే ఆవిడగారు వరసాగా తలంటి పోస్తుంది...

ఆ ముందురోజే అనగా శనివారంనాడే జోగారావు సాంబ్రాణి సబ్బులూ తెస్తాడు. అందరి స్నానాలూ అయినాక సాంబ్రాణి పొగ వేసుకుంటారు. పిల్లలందరూ తలయి విరియబోసుకుని, గుమ గుమలాడుతూ, అదో కొత్త అందాలు శరీరాల్లోంచి మెరిసిపోతూంటే, దేవకన్యల్లా, ఆ యింట్లో తిరుగుతూంటే ఆ భార్యాభర్తలిద్దరూ ఎంత సంతోషిస్తారో చెప్పలేం వాళ్ళని చూసుకుని. ఇద్దరికీ అంత శ్రద్ధ కాబట్టే ఆడపిల్లలున్న ఆ కొంపలో పనులన్నీ అతి వేగిరం తెమిలిపోతుంటాయి. అతని సహకారమేగాని ఆ యింట్లో లేకపోయినట్టయితే రోజూ నీళ్ళపోతలే అవును. అంచేత అతను భార్యాప్రియుడు.

* * * *

మధ్యాహ్నం భోజనాలయేక శేఖర్ కాస్త విశ్రాంతి తీసుకుంటున్నాడు. పిల్లలు కాస్త దూరంగా ఆడుకుంటున్నారు. భార్యా సుశీల పనులన్నీ ముగించుకుని, టాయిలేట్ అయి భర్త దగ్గరికి వచ్చి నిలబడింది. శేఖర్ కొంచెం ఆశ్చర్యంగా ఆమె వయిపు చూసి చిరునవ్వు నవ్వేడు—

"కాస్త పిల్లల్ని చూసుకోండి—మహిళా సంఘానికి వెళ్ళి ఇట్టే వచ్చేస్తాను. ఈవేళ ఎవరో మంత్రిగారి భార్య వస్తుందట!" అని వినయంగా అడిగింది.

"ఆహాఁ...అలాగా! నే చూసుకుంటాలే వెళ్ళిరా" అని నవ్వుతూ ఆమెను పంపించేడు.

కాబట్టి ఆమెకి అతను చాలా ప్రియుడు. ఆమె మాటకి అతనెప్పుడూ కాదనడు. తననింట్లో వుండమని ఆమె ఎక్కడికి వెళ్ళినా ఏమీ అనడు. అలాగని ఆమె చెడు తిరుగుళ్ళు తిరగదు. ఇరుగింటికీ, పొరు

గింటికీ, బంధువులూ, స్నేహితుల ఇళ్ళకీ, మహిళా సంఘాలకీ వెడుతుంది. ఆమె ఎప్పుడూ వినయంగా అడుగుతుంది. అడక్కుండా ఎక్కడికీ వెళ్ళదు. అతనూ కాదనడు, అందుకే పేచీ వుండదు.

ఆ సాయంత్రం ఆమె ఇంటికి వచ్చింది. రాత్రికి వంటాగింటా అంతా గబగబా చేసేసి ఇంటి పనులన్నీ చేసుకుని—పక్కలూ అవీ రెడీ చేసి, మళ్ళీ సింగారించుకువచ్చి భర్త దగ్గర కూచుంది. ఈ మాదు శేఖర్ ఇంకోలా అనుకున్నాడు. ఆ సమయం-ఆమె ఆకారం చూసి-

"సుశీలా! నువ్వు—ఎంత" అని అనబోయేసరికి... "ఆఁ...ఆఁ... ఆగండిమరేం!" అని నవ్వుతూ వెనక్కి జరుగుతూ "మా మహిళా సమాజం వాళ్ళందరం ఇవాళ సినిమా ప్రోగ్రాం వేసుకున్నాం. రెండో ఆటకి అందరం వేన్ మీద వెళతాం. సరేనా?" అని అంది మురిపిస్తూ.

శేఖర్ హతోస్మి అనుకున్నాడు.

"అందుకా..." అని నిట్టూర్చి జాలిగా చూస్తూ అన్నాడు.

"మరి వస్తాగా?..." అని అంది బుగ్గమీద చిటికవేసి, "అయితే సరే..." అని అన్నాడు శేఖర్.

ఇలా ఆమె ఎక్కడికి వెళతానన్నా వద్దనడు. అట్లాగే ఆమె పుట్టింటికి వెళతానన్నా ఎప్పుడంటే అప్పుడు పంపిస్తాడు. అందుకేఅతను భార్యాప్రియుడయి కూర్చున్నాడు.

* * * *

సావిత్రిముందు బస్సెక్కింది. చంటి పిల్లాడిని అందుకొని బెర్తుమీద పడుక్కోపెట్టింది. తర్వాత ఒకటీ, రెండూ. మూడు, నాలుగు ఇలా వరసగా పిల్లల్ని పెట్టెలోకి తన భర్త అందిస్తూ వుంటే చెయ్యిపట్టుగు ఎక్కించింది. తర్వాత సామాన్లు...మొత్తం పదకొండుమూర్తులు అన్నీ అయినాక రైలు కదులుతుంటే చెమట తుడుచుకుంటూ ఎక్కేడు సత్యారావు. ఎక్కగానే, పిల్లల్నీ—పెళ్ళాన్నీ—సామాన్లనీ కూడా లెక్కపెట్టుగొని, సరిగ్గా వున్నాయో లేదో చూసుకొని పెట్టెంతా ఒకసారి

కలియజూశాడు. బెంచీలమీద ఎవరివో పెట్టెలుంటే అడక్కుండానేవాటిని పిదనుసర్ది ఆ చోట బెడ్డింగులు పరిచేసి-తమ సామాను కంచుకోటలా చుట్టూ సర్ది మొత్తంమీద కంపార్టుమెంటులో సగం ఆక్రమించాడు. పిల్లల్ని ఎవరి జాగాలో వారిని కూర్చోబెట్టి, భార్యకి వేరే ప్రక్కవేశాడు. అక్కడే లగేజ్ పెట్టుకొనే బల్లతాలూకూ గొలుసుకి ఉయ్యాలకూడా ఎరేంజ్ చేసేడు. చంటిదాన్ని అందులో వేశాడు. ఇలా అంతాసర్ది ఇంకా వూపిరి తీసుకున్నాడో లేదో—ఏదో స్టేషన్‌లో బండి ఆగడం "అమ్మా మంచినీళ్ళే!" అని ఏ గుంట వెధవో అన్నాడు.

ఆ భార్యామణి చూపులతోనే అర్డరు వేసినట్లు భర్తవైపు చూసింది. అంతకుముందె ఆ విషయం గ్రహించి కిటికీలోంచి తలపైకి పెట్టికొంగలా చూశాడు ఆ స్టేషన్‌లో నీళ్ళు దొరుకుతాయో దొరకవో అని! దొరికితే సరేనని లేకపోతే ప్రతి స్టేషనులోనూ ఇదే పని.

ఆ తర్వాత ఒకడు... "నాన్నా!" అని రెండు వేళ్ళు చూపెడతాడు. "వెధవలకి రైలెక్కగానే సరి! వస్తాయి. ఎక్కడలేనివీని..." అని భార్య విసుక్కోవడం మొదలెట్టేసరికి అతగాడే మరి ఆవిడ సంజ్ఞ చేయవలసిన పని లేకుండానే లెవెట్రీలోకి తీసుకెళ్ళి... తీసుకువస్తాడు.

ప్రయాణం అయినంత సేపూ, మళ్ళీ బండిదిగేవరకూ అదేపని అతనికి! తన పిల్లలూ, పెళ్ళాం, వాళ్ళ అవసరాలు తీర్చడం! ఇదే లోకం! మరి మిగతా ఏమవుతున్నదీ అక్కర్లేదు. వాళ్ళకి పక్కలు వేయడం, దుప్పట్లు కప్పడం, బెంచీల మించి పడిపోకుండా చూడడం. సామాన్లు ఎవరూ. దొంగిలించకుండా కాపలా కాయడం ఎప్పటి కప్పుడు కాఫీలూ, టిఫిన్లు, సప్లయి చేసుకోడం, ఇవన్నీ అతను చూసుకోవలసిందే! మళ్ళీ దిగేప్పుడు జాగ్రత్తగా ఏ వొక్కటీ పోకుండా పెళ్ళాం దగ్గర్నించి పదిలంగా దిగిందోలేదో చూసుకుంటాడు.

అంచేత అతని భార్య ఏమీ కష్టపడక్కరలేదు. ఏ పూచి లేకుండా బెంగ, భయమూ ఇంత విసరూ లేకుండా ఎంతో సుఖంగా ప్రయాణం

ఇంట్లో వున్నట్టే జరిగిపోతోంది. అందుకే సత్యారావు లాంటి భర్తలు భార్యా ప్రియులని వేరే చెప్పాలా?

* * * *

"అట్లా ముద్దర వేసినట్లు కూచోకపోతే ఆ పిల్లలని నాలుగు కేక లేస్తే ఏం పోయింది! అలా అల్లరి పెడుతున్నారు కదా!" అని భర్తమీద కసురుకుంది విమల...

పరధ్యానంగా వున్నవాడి మీద చెళ్ళని దెబ్బ వేసినట్టు...ఉలిక్కి పడ్డాడు విశ్వనాథం.

అలా అంటుంది కదా అని-కలుగ జేసుకుని తనే ముందుగా "వెధవల్లారా ఏమిటా అల్లరి" అని పిల్లల్ని కేకలేస్తాడనుకోంది.

"చాల్లెండి! మా గొప్ప మాట్లాడితే చాలు. పిల్లలమీద విరుచుకు పడతారేం." అని మీద కొస్తుంది ఆ ఇల్లాలు.

"చావు వెధవా—ఎంత పూరుకున్నా, ప్రాణం తినేస్తున్నావు... అమ్మ పెట్టేవి రెండూ పెడితేగాని..." అని తిడుతూ దబదబా ఒక పిల్ల వాడిని వేసింది. ఆ పిడుగుల్లాటి దెబ్బలకు ఆ పిల్లడు మరింత బిక్కచచ్చి రాగం హెచ్చించాడు! దానితోపాటే ఆమెకి చికాకు మరీలావయిపోయింది. అక్కడ నుండి సామాన్లు విసిరేయడం-గట్టిగా పెట్టడం మొదలెట్టింది.

ఆ సమయానికే పనిమనిషి వచ్చింది.

"ఏం తల్లీ! ఇప్పుడా నీకు తీరికయింది. అవున్లే! మీకేం...మా ఖర్మకాలి..." అని పనిమనిషి మీద—

పాలవాడు వస్తే

"కంగుమని సేరుకి రూపాయి నీ యదాన్ని పోయడమేగాని...ఒక పావలా ఖరీదు చేసే పాలయినా ఇస్తున్నావా?...అన్నీ నీళ్ళ నీళ్ళు." అని వాడి మీద...

"అమ్మమ్మ! వెధవకొళాయి... వెధవ కొళాయి! గంటలకొద్దీ—నిలబడినా ఒక చెంబుడు నీళ్ళయినా దొరకవు కదా! ఆ నారాయణమ్మ

మరీనీ...ఎంత అశో! అన్ని నీళ్ళు తన ఇంట్లోనే పోసేసుకుంటుంది." అనీ పారాయణం అందరి మీదా మొదలెడుతుంది.

వెనకాల సన్నాయి బాకా లాగ ఎవడో ఒకడుఏడుస్తూనేఉంటాడు పూతగా.

అలా లేచిన దగ్గర్నుండి అటు భర్తమీద ఇటు పిల్లలమీద నౌకర మీద ఊళ్ళో వాళ్ళమీద లేకపోతే ఎవరో ఒకరిమీద చీదరించుకుంటూనే వుంటుంది ఆ మహా ఇల్లాలు. ఆమెకది అలవాటయిపోయింది. పైవాళ్ళె వరయినా వింటే.

"ఇదేమిట్రా భగవంతుడా! ఇది ఇల్లా, నరకమా? ఈమె ఇల్లాలా, దయ్యమా? ఎట్లా భరిస్తున్నాడీ దౌర్భాగ్యుడు" అని విసుక్కుంటారు." కాని-విశ్వనాథానికది రోజూ పరిపాటయి పోయింది. అన్నిటికీ ఊరుకుంటే మంచిదిగాని కాదంటే మరీ పోరు లావయిపోతుందని అతనికి తెలుసు. అయనేగాని సహించి అన్నిటికీ ఊరుకోక పోయినట్టయితే ఆ సంసారంలో సుఖశాంతులు ఏనాడో మాయమయి ఒక మహా నరకం క్రింద మారివుండును. మరో పాటివాడయితే సహించలేక ఆమెను చావ గొట్టి చెవులూ నోరు మూసినా, ఏదో ఒక అఘాయిత్యం జరిగివుండును.

ఆ ఇల్లాలు ఎంత గయ్యాళి అయినా, చిటపటలాడి నోరు చెయ్యి, పారేసుకున్నా సర్దుకుపోయే విశ్వనాథం లాటి భర్తనయితే ఆమె కూడా నెత్తిన పెట్టుకు పూజిస్తుంది? అందుకే వాళ్ళ సంసారంలో "సారం" ఇంకా మిగిలే వుంటుంది. అట్లాంటి భార్యలకయినా వారి భర్తలు ప్రియులే.

* * * *

ఇలాటి కమలా కామేశ్వర్రావులూ, కామాక్షీ కుటుంబరావులూ, జానకి జోగారావులూ, సుశీలా శేఖర్లూ, సావిత్రీ సత్యారావులూ, విమలా విశ్వనాథంలూ, ఎంతోమంది మనకు నిత్యజీవితంలో కనబడుతూ వుంటారు.

వీళ్ళందరూ అసలు కిటుకు కనిబెట్టి, భార్యకి అనుకూలంగా తమ తమ రంగులు మార్చుకుని సంసారాన్ని స్వర్గతుల్యంగా చేసుకుంటూం

టారు. వీళ్ళందరూ "భార్యా ప్రియులు" కాని అది చాతకాక కొందరు ఈర్ష్య కొద్దీ వీళ్ళని-"భార్యా విధేయులు" అని అనేస్తారు! కాని... మనలో మనమాట...!

భార్య మొహం చూసి అయ్యో పాపం అని వండిపెట్టడం మాట అటువుంచి, ఏ సుప్రభాతంలో నయినా కనీసం కాఫీ టిఫినూ అయినా అందించిన పాపాన్నిపోరు కొందరు సరికదా, ఉదయం ఎనిమిదయినా లేవకుండా కాఫీ, టిఫినూ టేబిల్ మీద చల్లారిపోతున్నా...అవిడగారు ఎంత పిలుస్తున్నా...భోజనానికి లేవకుండా ఆలశ్యం చేస్తూంటారు.

అర్థాంగిని పనులు చేసుకోనివ్వకుండా పిల్లలు అల్లరిపెడుతూ కొంగుపట్టుకు వ్రేళ్ళాడుతున్నా తమను కాదన్నట్టు వుంటారు కొందరు భర్తాగ్రేసరులు. ఆ మాత్రం సానుభూతితో పిల్లలిని ఆడిస్తే తప్పా?

ఆదివారం ఆఫీసు సెలవు దినాల్లో, స్నేహితులతో పేకాటతో, క్లబ్బులతోనూ, సరదాలతోనూ గడిపేస్తారు. కాని, ఆ ఒక్కరోజూ ఇంట్లో ఆడదానికి కాస్త రెస్టు యిచ్చి సంసారం కోసం, 'ఇంటిపని' కోసం గడుపుదామని చాలామంది మగవాళ్ళకు తోచదు.

ఎక్కడికి పడితే అక్కడికి, ఎప్పుడు పడితే అప్పుడు కాక పోయినా, భార్యారత్నం ఎప్పుడో ముద్దుగా ఎక్కడికయినా వెళతానంటే, అలాగే అని నోరారా కొందరు భర్తలు అనరుకదా. పుట్టింటికి వెడతానని పట్టుపట్టినా కారాలూ, మిరియాలూ నూరందే పంపరు. ఎక్కడికి అయినా అథవా పంపినా, ఆమె వెంటే పటాలంలా సంతానాన్ని కూడా తీసుకు పొమ్మంటారు. ఎందుకంటే అలా వెళ్ళిన ఆడవాళ్ళకు తిరిగి యింటికి రావాలని గడియ గడియకూ జ్ఞాపకం చేసేది ఆ పిల్లలే...లేకపోతే ఆ భర్తగారు వెళ్ళి పిలిస్తేనేగాని రారని ఇల్లూ, భర్తా అంటూ వున్నాయని అప్పటికిగాని జ్ఞాపకం రానని...ఆ భర్తలు అంటూవుంటారు.

భార్యా పాపం పని వత్తిడిలో అందరి మీదా చికాకు పడుతుందనే అనుకోండి. ఆఖరుకు ఓపికచు భర్తమీదకూడా కసురుకుంటుందనే అను

కోండి. అంత మాత్రంలో ఆ భర్త నాకు కాదనుకుంటే ఏం పోయింది! అలాకాకుండా ఆమెస్థితి అర్థంచేసుకోకుండా బావగొట్టి చెవులు మూస్తారు మరికొందరు భర్తాగ్రగణ్యులు.

కుటుంబంతోసహ ప్రయాణం చేయడం వచ్చినప్పుడు కొందరయితే, భార్యా ఇంజను గానూ, భర్త గార్డుగాను, పిల్లలు రైలు పెట్టెలు లాగూ జాగ్రత్తగా పట్టా తప్పకుండా వెళతారు! పిల్లల సుఖం, పెళ్ళాం సుఖం కొందరు చూస్తారు. కాని మరికొందరు భర్తలుంటారు చూడండి, భార్యని, పిల్లల్ని ఏ ఆడవాళ్ళ పెట్టెలోనో బస్తా లెక్కించినట్లు కూరేసి, యిహ వాళ్ళ కర్మానికి వాళ్ళను ఏడవమని-తాముమాత్రం మరోపెట్టెలో ఎవరితోనో హస్కు పెట్టుకుంటూ కూచుంటారు. మళ్ళీ గమ్యస్థానంలోనే వాళ్ళని కలుస్తారు. ఈ లోపున వాళ్ళకు ఏది కావలసి వచ్చినా మరి దిక్కు వుండదు.

ఇట్లాంటి భర్తగార్లు కూడా వున్నారు. అయితే వీళ్ళందరూ భార్యలతో సంసారాలు చేయడం లేదా అంటే అది వేరే సంగతి, భార్యా భర్తలు ఒకరి కొకరి సానుభూతి సహకారం వుండాలి. భార్యకి అనుకూలంగా వుండడంలో భార్యా ప్రియులు అవుతారు. పోనీ భార్యా విధేయులు అని అనిపించుకున్నా ఫరవాలేదుగా..."భార్యా విరోధులు" మాత్రం కాకండి!

—ఆంధ్రజ్యోతి 21-7-67